
# అందమైన భారతదేశం



894.8268 022
మురళి - అందమై
128661

C-82530

# మన దేశము - మన ప్రజలు

ఉత్తరాన హిమాలయాలనుండి దక్షిణాన కన్యాకుమారి వరకు వ్యాపించి 1,220 మైళ్ళ వైశాల్యము కల్గి అనేక నదులు, పర్వతాలు, మైదానాలు, పుణ్యక్షేత్రాలు, బ్రహ్మాండమైన ప్రాచీన కట్టడాలతో, వివిధ సంస్కృతుల సరళ సమ్మేళనంతో అద్వితీయ సౌందర్యమూర్తియని విశ్వవిఖ్యాతినార్జించినదీ భారతావని. గంగా యమున నదీజలాలతో ఫలవంతమై ఉత్తరదేశ మైదానాలనుండి సింధునదీ తీరాన కృష్ణ గోదావరీ, కావేరీ నదుల డెల్టాలలో మహోన్నతమైన నాగరికతలు విరాజిల్లగ చరిత్ర ప్రసిద్ధిగన్నదీ భారతదేశము!! ప్రపంచంలోని అతి ప్రాచీనమైన నాగరికతలలో ముఖ్యమైనది మన నాగరికత. క్రీ.పూ. 1500 సం॥ ప్రాంతాన ఆర్యులు హిమాలయాలను దాటి భారతదేశంలో ప్రవేశించినప్పుడు తమకంటె నాగరికులైన జాతులు ఈ దేశంలో నివసించడం చూసారు. ఇటుకలతో నిర్మించిన ఇళ్ల వరుసలతో, తీర్చిదిద్దిన వీధులతో, పథకం ప్రకారం నిర్మించిన ధాన్యాగారాలతో, మురుగునీటి వసరులతో స్నానమందిరాలతో, సలక్షణమైన నగరాలతో శోభిస్తున్న జనపదాలుండేవి. బాబిలోనియా వంటి దూరతీరాలుగల దేశాలతోగూడ ఆనాడు వర్తకవాణిజ్య సంబంధాలుండేవి.

మధ్య ఆశియా, ఆఫ్ఘనిస్తాన్, పెర్షియా, సిలన్, ఇండోనేషియా, బర్మా, చైనా మొదలైన దేశాల ప్రజలు ఆనాటి భారతీయుల నాగరికతావైభవాన్ని, సంస్కృతీ సంపత్తిని దర్శించి, సమ్మోహితులై వారి అడుగుజాడలలో తమ సాంఘిక వ్యవస్థలను తీర్చిదిద్దుకొన్నట్లు చారిత్ర కాధారాలున్నాయి.

శతాబ్దాలు కాలగర్భంలో కరిగిపోయి, నాగరికతల స్వరూపాలు మారిపోయి, రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలు తారుమారయ్యాయి. ప్రముఖంగా ఎనిమిదో శతాబ్దంలో మహమ్మదీయులు వర్తకవాణిజ్యాలకోసం, రాజకీయాధిపత్యంకోసం, సిరిసంపదలు దోచుకోవడం కోసం దండయాత్రలు సాగించడంతో భారతదేశ ప్రాభవ వైభవాలు కాంతి తప్పసాగాయి.

ఆ తరువాత భారతదేశాన్ని పాలించిన కొందరు మహమ్మదీయ రాజుల వలన భారతదేశంలో క్రొంగొత్త నాగరికత వెలసింది. మొఘల్ పాదుషాలలో కొందరు లలిత కళలను ఆదరించి ప్రోత్సహించారు. ఆ తరువాత మరికొన్ని వందల సంవత్సరాలు గడిచాయి. 17-18 శతాబ్దాలలో భారత జాతీయ జీవితముపై పాశ్చాత్యుల ప్రభావం ప్రసరింపసాగింది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, శాస్త్రీయ రంగాలలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కన్పించింది.

జనసంఖ్యలో చైనా తరువాత భారతదేశమే పెద్దది. ప్రపంచంలోని మొత్తము జనసంఖ్యలో భారతీయులు ఎడవవంతు. దయాధర్మాలకు, సత్యాహింసలకు, అతిథి సత్కారాలకు అనాదిగ ఖ్యాతినార్జించింది ఈ పురాణభూమి. స్వాతంత్ర్యం లభించింది. ఆంగ్లేయులు భారతదేశంనుండి వైదొలిగారు. ప్రజాస్వామిక సిద్ధాంతంపై భారతదేశ ప్రభుత్వం నిర్మాణమైంది. రాష్ట్రాలకు స్థానిక ప్రభుత్వాలున్నాయి. ఈ ప్రభుత్వాలకు అత్యవసర సమయాలలో తప్ప, సాధారణంగా మిక్కిలి పరిపాలనా స్వేచ్ఛ గలదు. వివిధ రాష్ట్రాలకు

వివిధములైన మాతృభాషలున్నాయి. కాశ్మీరము, ఒరియా, హిందీ, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం వంటి ప్రాంతీయ భాషలెన్నో విశేష సాహిత్యసంపదలతో విరాజిల్లుతున్నాయి. ప్రపంచానగల మతాలన్ని ఇంచుమించు గా భారతదేశంలో వున్నాయి. హిందువులు అధిక సంఖ్యాకులైనా, మహమ్మదీయులు, క్రైస్తవులు. సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, యూదులు, భారతదేశంలో అన్ని ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఆంగ్లేయులు, అమెరికన్లు, చైనీయులు వంటి విదేశీయులెందరో, వర్తకవాణిజ్యాది వ్యాపకాలతో భారతదేశంలోని అనేక ప్రముఖనగరాలలో నివసిస్తున్నారు.

సువిశాలమైన భారతదేశంలో విభిన్న శీతోష్ణస్థితులున్నాయి. ఋతువులను అనుసరించి ప్రతి ప్రదేశంలో శీతోష్ణస్థితి మారుతుంది. సర్వసాధారణంగా దేశంలోని అధిక భాగాలు శీతాకాలంలో ఆహ్లాదకరంగా ఉంటాయి. ఉత్తర భారతంలో కొన్ని ప్రదేశాలలో చలి ఎక్కువగా వుంటుంది. మంచు ఎక్కువగా కురుస్తుంది. దక్షిణ భారత దేశంలో చలి అంత ఎక్కువగా వుండదు. వేసవికాలంలో వేడి ఎక్కువ. ఈ వేడి నుండి తప్పించుకోడానికి వేసవి విడుదులకు పర్వతాలపైవున్న వేసవి విడుదులకు (హిల్ స్టేషన్స్). వేలాదిమంది వెళుతుంటారు. వీటిలో కాశ్మీర్, కులూలోయ, సిమ్లా, ముస్సోరి, నైనిటాల్, డార్జిలింగ్, ఊటీ, కొడైకెనాల్ పేర్కొనదగినవి. ఇక్కడ ఎండాకాలంలో కూడా ఉష్ణోగ్రత 60°-70° F డిగ్రీలను మించి పెరగదు.

జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో వీచే ఋతుపవనాలవల్ల దేశంలో అనేక ప్రాంతాలలో వర్షాలు పడతాయి. కొన్ని ప్రాంతాలు మాత్రం ఏ కాలంలో నైనా అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉంటాయి.

భారతదేశములో ఉన్నటువంటి సౌందర్య వైవిధ్యం, పురాతన కట్టడాలు, ఆచారవ్యవహారాలు, పండుగలు, వేడుకలు, మతసిద్ధాంతాలు, అరణ్యాలు, నదీనదాలు, కొండలు, లోయలు, సస్యశ్యామల మైదానాలు ఇంకే దేశంలోనూ లేవు. అందుకే భారతదేశం సౌందర్యనిలయమై యాత్రికులకు కన్నులపండుగ కలిగిస్తుంది. అడవిపందులు, పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, గుంపులు గుంపులుగ సంచరించు మన అరణ్యాలు ప్రపంచప్రసిద్ధి చెందిన క్రీడాకేంద్రాలయ్యాయి. పర్వతారోహకులకు హిమాలయాలు దేవాలయాలు. ఎవరెస్ట్ శిఖరము హిమాలయాల్లోని మహోన్నత శిఖరము.

మన చేతిపనులు, కుటీరపరిశ్రమలు, విశ్వవిఖ్యాతమైనట్టివి. కుటీర పరిశ్రమలలో తయారయ్యే ప్రతివస్తువు దేనికది ప్రత్యేకత కలిగి అపూర్వ కళాఖండంలా కన్పిస్తుంది. ఫ్యాక్టరీలో తయారైనట్లు అన్ని వస్తువులు ఒకే మూసలోంచి వెలువడ్డట్టుకాక దేని సౌందర్యం దానిదై, దేని స్వరూపం దానిదై భాసిస్తుంటాయి. కాశ్మీర్‌లో తయారగుచున్న శాలువలు ప్రపంచమంతా పేరెన్నిక గల్గినవి. ఢిల్లీ, జైపూర్ వంటి ప్రాంతాలలో పనివారు ఆభరణములు తయారుచేయుటలో సాటిలేనివారు. మైసూర్, తిరువాన్కూరులు దంతపు వస్తువులకు పేరుపొందిన ప్రదేశాలు. మొరాదాబాద్, హైదరాబాద్‌లు లోహపు పనులకు ఫిరోజాబాద్ గాజుల తయారీ కేంద్రాలకు ప్రసిద్ధి.

# పశ్చిమ భారతము


సౌరాష్ట్రం నుండి ముంబాయి దక్షిణభాగం వరకు వ్యాపించిన భాగాన్ని పశ్చిమ భారతం అంటారు. పశ్చిమకనుమల వీవల సన్నని సారవంతమైన మైదానం ఈ పశ్చిమభారతము. పరిసర పర్వతాలలో చరిత్ర ప్రసిద్ధిగన్న మహారాష్ట్ర సామ్రాజ్యానికి చెందిన కోటలు కన్పిస్తుంటాయి. పత్తిపంటకు పేరుపడిన పొలాలు, ముంబాయి, అహమ్మదాబాద్ ప్రాంతాలలోని నూలు మిల్లులకు కావలసినంత పత్తిని పండిస్తున్నాయి.



స్టాక్ ఎక్స్ఛేంజ్

# ముంబాయి

భారతదేశంలోని ప్రముఖ నగరాలలో ముంబాయి ఒకటి. కొండలతో నిండిన ద్వీపాలతో సౌందర్యవిలసితమైన నౌకాశ్రయం ముంబాయి ప్రాముఖ్యానికి ప్రధాన కారణం. ఇక్కడి నౌకాశ్రయం విదేశవర్తకానికి కేంద్రం. విదేశాలనుండి మనదేశానికి చేరే నౌకలు ముంబాయి రేవును చేరటంతో దీనికి గేట్ వే ఆఫ్ ఇండియా అని పేరువచ్చింది. ఒకప్పుడు చేపలు పట్టి జీవించే కొద్దిమంది పల్లీలతో ప్రారంభమైన పల్లె పెరిగి పెద్దదై ఈనాడు ప్రపంచంలోనే ప్రముఖ వర్తక కేంద్రంగా రూపొందింది. 1534 సం॥ గుజరాత్ సుల్తాన్ దీనిని పోర్చుగీస్‌వారికి ఇచ్చాడు.



విక్టోరియా టెర్మినస్



ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియమ్






హుటాత్మ చౌక్

**1661**లో పోర్చుగల్ ప్రభువు దీనిని ఆంగ్లేయులకు పెండ్లికట్నముగా బహూకరించినాడు. కొన్ని సంవత్సరముల తర్వాత బ్రిటిష్‌రాజు దీనిని ఈస్టిండియా కంపెనీకి అద్దెకిచ్చినాడు. ఆనాటినుండి ఇది క్రమక్రమముగా అభివృద్ధి చెందసాగినది.



మెరైన్ బీచ్

వర్తకవాణిజ్యములకేగాక పారిశ్రామిక కేంద్రముగ కూడ బొంబాయి ప్రాముఖ్యత నార్జించుకొన్నది. రాత్రింబవళ్ళు అంతులేని సంచలనముతో, వచ్చుపోవు ఓడలతో, రైళ్ళతో, కిటకిటలాడు వీధులతో, విరామమెరుగని బ్రహ్మాండమైన హోటళ్ళతో, వందలాది సంఖ్యగల్గి నిరంతరము పనిచేయు కర్మాగారములతో, సాయంసమయములందు లక్షలాది ప్రజలకు అత్యంతాహ్లాదకరమైన ఆశ్రయమిచ్చు మెరైన్ బీచ్‌తో, కంబాలా- మలబార్ కొండలపైగల విశ్రాంతి గృహములతో, చక్కటి తోటలతో, తీర్చిదిద్దిన బాటలతో, సలక్షణముగ నిర్మించబడిన పేటలతో, అద్భుత చైతన్య స్రవంతివలె దర్శనమిచ్చు మహానగర మీ బొంబాయి. ప్రిన్స్ ఆఫ్ వేల్సు మూజియం, ఆర్ట్‌గేలరీ, అపాల్లో బందర్‌పైగల గేటు, మహాలక్ష్మి దేవాలయము, వజ్రేశ్వరీ, నీటిబుగ్గలు, క్రాఫోర్డు మార్కెట్, విక్టోరియా గార్డెన్లు, జంతుప్రదర్శనశాల, ఎలిఫెంటాగుహలు, మహాలక్ష్మి గుర్రపు పందెములు, బ్రాబోర్నుస్టేడియం, స్విమ్మింగ్‌పూల్స్ మొదలైన ఆకర్షణలు బొంబాయి నగరమందు అసంఖ్యాకముగ ఉన్నవి.



యూనివర్సిటీ బిల్డింగ్



శాంతాక్రుజ్ స్టేషన్‌కు రెండుమైళ్ళ దూరములో సముద్రతీరమందు జుహు అను గొప్ప విశ్రాంతి విడిది గలదు. వారాంతమందు శెలవుదినములందు వేలాది ప్రజలీ ప్రాంతమునకు విహారార్థము విచ్చేయుచుందురు. బొంబాయికి దక్షిణముగ ఎనిమిది మైళ్ళ దూరమున ఎనిమిదివ శతాబ్దమున నిర్మించబడి చరిత్ర ప్రసిద్ధిగన్న ఎలిఫెంటా గుహాలయములున్నవి. ఇందుగల అనేక శిల్పములందు 19 అడుగుల ఎత్తుగల మూడు తలల త్రిమూర్తి విగ్రహము మిక్కిలి శోభాయమానమైనట్టిది.

## పూనా

ముంబాయికి 119 మైళ్ళ దూరమునగల చరిత్ర ప్రసిద్ధిగన్న పట్టణము పూనా. బొంబాయినుండి-పూనాకు డక్కన్‌రాణి అను ఇండియాలోకెల్ల మిక్కిలి వేగముగపరుగెత్తు రైలు బండి కలదు. పీష్వాలకాలమున పూనా మహారాష్ట్ర సామ్రాజ్యమున రాజధానిగా నుండెడిది. ఆనాటి పూరాతన కట్టడములెన్నియో నేటికిని కన్పించుచుండును. ఈనాడు దేశమందలి ప్రముఖ సైనిక కేంద్రములలో పూనా ఒకటి.

## లోనవాల

ముంబాయికి ఎనభైమైళ్ళ దూరమందున్న లోనవాల అను ప్రదేశము విలాస విహారములకు పేరుగన్నది. వేసవియందు ఇచటగల సరస్సులలో, విహరించుటకై, బొంబాయి పరిసరములనుండి అనేకమంది ప్రజలిచ్చటకు వచ్చుచుందురు. లోనవాలకు పోవు రాజమార్గముపై కర్లె, భాజా అను ప్రాంతములందు బుద్ధునికాలమున చెక్కబడిన గుహాలయములున్నవి. కర్లెయందు ఒకే ఒక రాతితో నిర్మించబడిన బౌద్ధాలయమునందలి శిల్పసంపద గణనీయమైనది.




## సూరత్

బొంబాయికి 163 మైళ్ళ దూరమున తపతీనదిపై నిర్మించబడిన సూరత్, మొఘల్‌పాదుషాల కాలమునుండి మిక్కిలి ప్రాముఖ్యతగలిగి ఉన్నది. మక్కాచేరు యాత్రికులందరికీ సూరత్ మొదటి మజిలీగనున్నది. పశ్చిమ భారతమునందలి వర్తకవాణిజ్యములకు కేంద్రమై, కోటీశ్వరులైన వర్తకులకు నివాసమైనదీ నగరము. నదీతీరమున నేటికిని నిల్చియున్న కోటపైనుండి, సూరత్‌ను చక్కగ చూడవచ్చును. లోగడ నిర్మించబడిన 512 మైళ్ళ పోడవుగల గోడ, నగరమును చుట్టియుండును. ఇంగ్లీషు వారు, పోర్చుగీసువారు, రాజకీయాధిపత్యమునకై పెనుగులాడునప్పుడు, సూరత్ నగరమొక కేంద్రమైనది. ఆనాడు వారు నిర్మించిన భవంతులు, ఫ్యాక్టరీలు శిథిలములైనను నేటికి దర్శనీయములై ఉన్నవి.

## బిజాపూర్

పదునారవ శతాబ్దాలకి భారతదేశమునగల అనేక రాజ్యములలో ప్రముఖమైనట్టి ఒక మహమ్మదీయరాజ్యమునకు రాజధానిగా అనేక కట్టడములలో మహమ్మద్ ఆదిల్‌షాసుల్తాను పేరిట నిర్మంచబడిన ఈ సౌధమునందు 124 అడుగుల వ్యాసార్థముగల్గిన గోపురములు నాలుగు మూలలందును గలవు. ఈ భవనమున ఒక చోటనుండి పిలిచినచో అనేక ప్రతిధ్వనులు వినిపించును. ఇదిగాక సాత్‌మంజిల్– ఇబ్రహీం ఆదిల్‌షా సమాధి, గగన్‌మహల్ మొదలైన పేర్కొనదగినవి.




## బరోడా

విశ్వామిత్రి అను నదీతీరమున, నవీనపద్ధతులలో నిర్మించబడినది బరోడా. ఇండోసార్సెనిక్ సంప్రదాయముతో నిర్మించబడిన, లక్ష్మీవిలాస్ ప్యాలేస్, జంతు ప్రదర్శనశాల, మ్యూజియమ్, పిక్చర్ గ్యాలరీ, పబ్లిక్ పార్క్, ప్రాచీనపరిశోధనాకేంద్రము, సుర్‌సాగర్ చెరువు, మకార్ పురాభవనీ ప్రాంగణమునగల పూలతోటలు, అమూల్యాభరణములతో విరాజిల్లు నాజర్‌బాగ్ ప్యాలస్, కూటీరపరిశ్రమల ప్రదర్శనశాల మొదలైనవి దర్శనీయమైన కొన్ని ప్రాంతములు.

## అహమ్మదాబాద్

పశ్చిమ భారతమందలి ప్రముఖ పారిశ్రామిక కేంద్రములలో ఒకటైన అహమ్మదాబాద్ సబర్మతి నదితీరమున 1411లో నిర్మించబడినది. మహమ్మదీయ సంప్రదాయమునకు చెందిన మసీదులు, భవంతులు విరివిగా ఈ నగరమందు చూడగలము. 1424లో నిర్మించబడిన జమ్మామసీదువంటిది తూర్పు దేశములందెచ్చటను కానరాదు. ఆ పిమ్మట పేర్కొనదగినది సిదీసయ్యద్ మసీదు. ఈ సబర్మతీ నదీ తీరమునందే, విశ్వవిఖ్యాతమైన ఆశ్రమము మహాత్ముడు నిర్మించి, తన రాజకీయ వ్యాసంగమునకు కేంద్రముగ చేసికొనినాడు.





## సౌరాష్ట్ర

సౌరాష్ట్రమందనేక పట్టణములూ, రేవులు, చక్కటి బాటలై- మార్గములు కలిగియున్నవి. సింహము లింకను తిరుగుచున్న గిర్ అడవులు ముత్యములనేరుట కవకాశముగల తావులు సౌరాష్ట్రమందలి ప్రత్యేకతలోకొన్ని జామ్‌నగర్ అనుపట్టణము సౌరాష్ట్రమునందు ప్రముఖమైనది. ఈ పట్టణమందలి కూడలిని కథియవార్‌నకు ఆభరణము అని వర్ణించుచుందురు.

## పాలితానా

జైనమతస్తులకు పవిత్రములై, పూజనీయములైన అయిదుకొండలలో ఒకటైన సత్రుంజయ అనుకొండ పాలితానా గలదు. ఈ కొండ జైనులకు గొప్ప యాత్రాస్థలమగుటచే ప్రపంచమందలి పలుప్రాంతముల నుండి అనేకమంది వచ్చి, ఇచ్చటగల 863 జైన దేవాలయములను దర్శించి పోవుచుందురు. ఈ దేవాలయములన్నియు పదకొండవ శతాబ్దమునకు చెందినవనీ, చరిత్రకారుల అభిప్రాయము.





## మౌంట్ అబు

అబురోడ్ రైల్వేస్టేషన్ చక్కటి రాజమార్గమునపోయి, మౌంట్అబు చేరవచ్చును. భారతదేశమందలి ముఖ్యమైన యాత్రాస్థలములలో ఇది ఒకటి. సముద్రమట్టమునకు 4,500 అడుగుల ఎత్తునగల సుందర సరోవర ప్రాంతమున సౌందర్యభరితమైన ప్రకృతి కన్పించును. ఇచ్చటగల దిల్వారా అను దేవాలయమునగల శిల్పసంపద, జైన సంప్రదాయమునకు మకుటాయమాన మందురు. తెల్లటి పాలరాతితో మధ్యయుగమునాటి శిల్ప సౌందర్యమునంతను మూటకట్టినట్లు మనోహరముగనుండునీ దేవాలయము.

## గోవా

గోవా నేడు శిథిలమైపోయినది. బ్రహ్మాండమైన చర్చీలు, ఆర్చిబిషప్ భవనము కాన్వెంట్ కట్టడములు మాత్రము నేటికి సలక్షణముగ నున్నవి. 1510వ సంవత్సరమున పోర్చుగీసువారు గోవాపట్టణమును ఆక్రమించుకొని 1565 నాటకి అచ్చట స్థిరపడి దానినొక ప్రముఖ కేంద్రముగ రూపొందించుకొనిరి. ఆనాడు నివాసములేర్పరచుకొన్న ప్రజల సంతతులకు చెందినవారే నేటికీ అచట కన్పించుచుందురు. నేడా ప్రాంతమునగల జనాభాలో నూటికి యాభైవంతులు క్రైస్తవులే.









# అజంతా-ఎల్లోరా

అజంతా, ఎల్లోరా శిల్పముల గురించి విననివారుండరు. ఎల్లోరాయందుగల శిల్పములు, బౌద్ధ, హైందవ, జైన సంప్రదాయములకు చెందినవి. దేనికది ముద్దుల మూటగట్టు చుండును. దేనికది సౌందర్య సర్వస్వమనిపించును. ఎంత కాలము చూసినను తనివితీరని కళాసౌందర్యము దాచుకొన్నదీ ఎల్లోరా. కైలాసదేవాలయమున గల బ్రహ్మాండమైన శిల్పములు నివ్వెరపాటు కల్గించునట్టివి. ఒకే ఒక కొండను నూరుసంవత్సరములపాటు తొలచి **30,00,000** ఘనపుటడుగుల రాతిని వెలికితీసి అనేక తరములవారు కలసి ఈ దేవాలయమును నిర్మించినారట.


**24** ఆరామములతో, అయిదు దేవాలయములతో రెండువేల సంవత్సరముల క్రిందట నిర్మింపబడిన ప్రాచీన కట్టడములతో, పరిసరముల నలంకరించిన ప్రకృతి సౌభాగ్యముతో దర్శనమిచ్చునది అజంతా. నిర్మాణకౌశలములో చిత్రలేఖనములో, శిల్పసంపదలో, అజంతాను పోలినది భారతదేశమందెచ్చటను కానరాదు. ఔరంగాబాద్‌నుండి మరికొద్ది దూరము ప్రయాణము సాగించి, పదవశతాబ్దము చరిత్రకు ప్రమాణముగ నిల్చిన దౌలతాబాద్ కోటను మత విద్వేష విషానలముతో మహాసామ్రాజ్యమును మంటగల్పిన ఔరంగజేబ్ పాదుషా సమాధిని దర్శింపవచ్చును.





# హైదరాబాద్







చిరకాలము హైద్రాబాద్ రాజ్యమునకు కేంద్రమై ఆ పిమ్మట స్వతంత్రభారతమున విలీనమై, ఇటీవల విశాలాంధ్ర రాష్ట్రమునకూ, ముక్కోటి తెలుగులకు రాజధానియైన భాగ్యనగరము- హైదరాబాద్. అన్ని కాలములందును చక్కటి వాతావరణముకలిగి, ఆరోగ్యకరమైన మంచినీటి వసరులు కలిగి, మిక్కిలి నివాసయోగ్యముగ కన్పించునది హైదరాబాద్. సువిశాలమైన బాటలతో, సుందరమైన మహోన్నతములైన భవంతులతో, శోభాయమానముగ ఉండునది హైదరాబాద్. ఉస్మానియా విశ్వవిద్యాలయ భవనము, హైకోర్టు, స్టేట్‌లైబ్రరీ, ఫలక్‌నామా ప్యాలేస్ మొదలైన కట్టడములు పేర్కొనదగినవి. దేశ దేశములనుండి తరతరములకు చెందిన, అనేక కళాఖండములను, అసాధారణ వ్యయప్రయాసలకోర్చి, ఏర్చికూర్చి నిర్మించబడిన సాలార్‌జంగ్ మ్యూజియం ప్రపంచ మందలి గొప్ప మ్యూజియంలలో నొకటి. సువిశాలమై సుందరమై సాయం సమయములందు వేలాది పురజనుల నాకర్షించునవి పబ్లిక్ గార్డెన్లు. ఆంధ్రప్రదేశ్ ఉభయ శాసనసభలు ఇందే నెలకొల్పబడినవి. ఇందొక జంతు ప్రదర్శనశాల గూడ కలదు. ఈ తోటలందు పచ్చికను, ప్రత్యేకముగా దూరదేశములనుండి తెప్పించి పెంచినారట! మామూలు పచ్చికవలెగాక, అది పట్టుకుచ్చులవలె మెత్తగా ఉండును.





ఇంకను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, గోల్కొండకోట, సాహిప్రభువుల మసీదులు, హైదరాబాద్‌కు 82 మైళ్ళ దూరములో సముద్ర మట్టమునకు 2,330 అడుగుల ఎత్తునగల చారిత్రకనగరము బీదర్‌లోని భామినీరాజుల శిథిల భవనములు చూడదగియున్నవి.


హైదరాబాద్ రాష్ట్రమునందు ఇంకను ముఖ్యమైన ప్రదేశములు: నాతనాథదేవాలయము. వరంగల్ జిల్లాయందుగల పాలంపేట దేవాలయము, రాయచూర్ ప్రాంతమునగల మహాదేవుని ఆలయము, నిజామాబాద్ జిల్లాలోని దిప్‌పల్లి యందలి విష్ణుదేవాలయము మొదలైనవి.



ముస్లిం సంప్రదాయమునకు చెందిన నిర్మాణములలో గుల్‌బర్గాయందుగల జమామసీదు, దౌలతాబాద్‌లోని చాంద్‌మినార్, హైదరాబాద్‌నగల చార్‌మినార్ పేర్కొనదగినవి.

## హంపి

ఆంధ్రుల చరిత్రలో స్వర్ణయుగమును నిర్మించిన విజయనగర సామ్రాజ్య మహావైభవ ప్రాభవములకు ప్రమాణముగానిల్చిన చారిత్రకనగరము హంపి. ఈనాడు శిథిలమై జీర్ణమై, కొండముచ్చు గుంపులకు విహారమై, కాలగర్భమున మరుగుబడిపోయిన గత సౌభాగ్యమును గురించి కలలు కనుచు, విలపించుచున్న నిర్మానుష్యప్రదేశ మీనాటి హంపి. తొమ్మిది చదరపు మైళ్ళ విశాలప్రదేశ మంతటను ఆనాటి గుడులు గోపురము, కోటలు, పేటలు, భవంతులు ప్రాకారములు శిథిలములై నాటి చరిత్రకు చిహ్నములై ఉన్నవి.





## మధ్య భారతము

భారతదేశమందత్యంత ఆసక్తిపంతమై చరిత్రప్రసిద్ధిగన్నది మధ్యభారతము. అనేక అద్భుత సాహసగాధలకు వేదికయై, అంతులేని కళాసంపదకు నిలయమై దర్శనీయమైనదీ ప్రాంతము. బాగ్‌యందలి చిత్రలేఖనము, సాంచీస్తూపములు, ఖజురాహో దేవాలయములు, మధ్య భారతపు సంస్కృతిని చాటుచున్నవి. నర్మదా నదీలోయలో పుష్కలముగ గోధుమ పండించు పొలములు భీకరారణ్యములతో నిండిన కొండలు, పత్తిపంటకు ప్రసిద్ధిగన్న నల్లరేగడి నేలలు, మధ్యభారతమున విరివిగ కన్పించు చుండును.

## ఇండోర్

బొంబాయికి **440** మైళ్ళ దూరమున సరస్వతీ-ఖాన్ నదీతీరములందు సముద్రమట్టమును **1830** అడుగుల ఎత్తునగల ఇండోర్ పట్టణము **1765-95** ప్రాంతమున హోల్కార్ వంశమునకు చెందిన రాణీ అహల్యాబాయిచే నిర్మిచబడినది. హోల్కార్ వంశమందలి ప్రముఖుల సంస్కృతికై నదీతరమున బ్రహ్మాండమైన ఛత్రీలు కట్టబడినవి. ఒకటవ మల్హర్‌రావ్ హోల్కార్ పేరునగల కట్టడము మిక్కిలి చక్కని శిల్పములతో నిండియున్నది. ఇటీవల నిర్మించబడినవాటిలో సుందరమైన ప్రాంగణములతోగల, ఎడ్వర్డ్‌హల్ లాల్‌బాగ్‌ప్యాలస్ ప్రముఖములు.








## ఉజ్జయిని

పాటలీపుత్రము రాజధానిగా మౌర్యసామ్రాజ్యమును బింబిసారుడు పాలించుచున్న కాలములో అతనికుమారుడు అశోకుడు ఉజ్జయినిలో రాజప్రతినిధిగ నియమించబడెను. కాళిదాసాది కవిరత్నములను పోషించినట్లు ప్రఖ్యాతిగన్న విక్రమాదిత్యునికి రాజధానిగా, అనుశ్రుతయుత మన కథలందు పేర్కొనబడుచున్న అద్భుత నగర మీ ఉజ్జయిని. ఇది భూపాల్‌నకు 114 మైళ్ళ దూరమందున్నది. ఉజ్జయినిలో శాప్రా అను నదీతీరముపై నిర్మించబడిన కలియధ అను సౌధము ప్రాచీనభారతమున నిర్మాణ కౌశలమెంత ఉన్నతస్థితి యందున్నదో నిరూపించుచున్నది. పఠాన్ సంప్రదాయమునకు చెందిన కోషక్‌మహల్, జమామసీదు, బత్తీసిబా ఓదీ అను కట్టడములు, జయపూర్ మహారాజ్‌చే నిర్మింపబడిన పరిశోధనాలయము ఇచ్చట చూడదగిన స్థలములు.



## భూపాల్

ముంబాయికి 521 మైళ్ళ దూరమందు పర్వతములతో నిండిన ప్రదేశమునగల భూపాల్ ఒకనాడు బౌద్ధమత కేంద్రమై మరొకనాడు చరిత్ర ప్రసిద్ధిగన్న ప్రభువు రాజభోజునికావాసమై నిమతికెక్కినది. చక్కటి సరస్సులు, పట్టణ రక్షణార్థము గత శతాబ్దములలో నిర్మించబడిన పెద్ద ప్రహరీగోడ, పరిసరప్రాంతమునగల కొండపై నిర్మించబడిన అహమ్మదాబాద్ ప్యాలస్ చూడదగిన ప్రదేశములు.



## సాంచి



భూపాల్‌కు 25 మైళ్ళ దూరములో ముంబాయి–ఢిల్లీ రైలు మార్గమునపైనున్న సాంచి బౌద్ధస్తూపములు భారతదేశమందు గల మిక్కిలి ప్రాచీన కట్టడములలో ముఖ్యమైనవి. అన్నింటిలో ప్రముఖమైనది 42 అడుగుల ఎత్తు, 103 అడుగుల వ్యాసార్థముగల్గి, ఇసుక రాతితో నిర్మించబడిన మహాస్థూపము. ఇందుపై క్రీ.పూ. ఒకటి రెండు శతాబ్దములందు చెక్కబడిన ప్రవచనములు, చిత్రములు నేటికి సుస్పష్టముగ నుండును. దీనికి నాలుగుప్రక్కల నాలుగుద్వారాములపై బుద్ధుని జాతక కథలను వర్ణించు చిత్రములు మనోజ్ఞముగ చెక్కబడి ఉన్నవి.

## గ్వాలియర్

గ్వాలియర్‌యందుగల ఆకర్షణలలో మొదటిది రెండుమైళ్ళ పొడవు, 300 అడుగుల ఎత్తుగల గ్వాలియర్‌కోట. కోటయందుగల అనేక ఆకర్షణలలో ముఖ్యమైనది రాజామాన్‌సింగ్ 15వ శతాబ్దపు చివరికాలములో నిర్మించిన మణిమందిరము. ప్రాచీనకాలమున హైందవ సంప్రదాయానుసారముగ నిర్మించబడిన సౌధములలో ఇది మణిపూసవంటిదని విజ్ఞులందురు. ఇందుగల ఏనుగులు, నెమళ్ళు మొదలైన చిత్రములు, వివిధవర్ణములలో రమణీయముగ సృష్టించబడినవి. మాన్‌సింగ్ తన రాణికొరకు ప్రత్యేకముగ నిర్మించిన మరొక రమ్యాహర్మ్యము గుజారీమహల్‌నందు ఇప్పుడొక పురావస్తు ప్రదర్శన శాలగలదు. 1093 సం॥ మున నిర్మించబడిన సాస్‌బాహు దేవాలయములు,






తైలికమందిరము మొదలైన కట్టడములు సౌందర్యనిలయములని పేరుగన్నవి. కోటచుట్టు జైన తీర్థంకరుల శిల్పములు చెక్కబడినవి. అందు కొన్ని 57 అడుగుల ఎత్తును గూడ గల్గియున్నవి. కోట వెలుపలగల పట్టణమున శాక్యరాజ మహారాణి జ్ఞాపకార్థము ఇటాలియన్ సంప్రదాయమున నిర్మించబడిన జయవిలాసమందిరమందు ప్రపంచమందెచ్చటను కానరానంత పెద్ద రత్న కంబళీయము గలదు. మానవాళి చరిత్రలో మహాగాయకుడై చిరస్మరణీయుడైన తాన్‌సేన్ సంస్మృతికై ఇచట నిర్మించబడిన కట్టడమును దర్శించుటకై వివిధప్రాంతములనుండి వేలాది గాయకులు, రసజ్ఞులు ఇచటకు విచ్చేయుచుందురు.

## సేవాగ్రాం

మానవాళి చిత్రో మహోజ్వలఘట్టముల నిర్మించి, మహోన్నతాదర్శముల సాధించి, బోధించి, కారణజన్ముడై, చిరస్మరణాయుడైన భారతజాతి పిత పూజ్యబాపూజీ జీవిత వ్యాసంగమునకు కొన్ని సంవత్సరములు కేంద్రమై, పూజనీయమైన పుణ్యభూమి సేవాగ్రాం. అనేకమంది స్త్రీ పురుషులు సేవాదీక్షతో ఈ ఆశ్రమమందు తమ జీవితములను తీర్చి దిద్దుకొనినారు. మహాత్ముడు దివి కేగిననాటినుంచి సేవాగ్రాం ఆశ్రమము ఆ మహనీయుని స్మృతిచిహ్నముగా భావించి నేల నాలుగు చెరగులనుండి అనేక మంది యాత్రికులువచ్చి దర్శించి పోవుచున్నారు. గాంధీజీ ఉపయోగించిన అనేకవస్తువులచ్చట ప్రదర్శనకై పదిలపరచినారు. మహాత్ముడు తన జీవితకాలమునందు అధిక ప్రాముఖ్యతనిచ్చి మిక్కిలి ప్రచారములోనికి తెచ్చిన ఆధార విద్యావిధానమునకు కుటీర పరిశ్రమలకు సేవాగ్రాం ముఖ్య కేంద్రమైనది.






# రాజస్థాన్

**1,30,000** చదరపుమైళ్ళ వైశాల్యముకల్గిన రాజస్థాన్‌లో అధికభాగము రాళ్ళతో, ఇసుకతో నిండిన ఎడారి ప్రదేశములతో నిండియున్నది. చెదురుమదురుగ అక్కడక్కడ మాత్రము అడవులు, సారవంతమై వ్యవసాయమునకుపకరించునేలలు గలవు. ఆరావాళి పర్వతములు రాజస్థాన్‌ను రెండు భాగములుగా విడదీసినవి. ఉదయపూర్, జైపూర్, జోధపూర్, బికనీర్. జైసాల్మర్, అజ్మీర్, మార్వార్ మొదలైన సంస్థానములన్నియు రాజస్థాన్‌కు చెందినవే. భారతదేశ చరిత్రలో మహావీరులని వాసికెక్కిన మహాపురుషుల నెందరినో సృష్టించి వారి సాహసోపేతమైన జీవితగాధలతో చిరస్మరణీయమైనది రాజస్థాన్. రాజపుత్ర వీరుల గాధలకంటె రసాత్యకమై, ఉదాత్తమై, శౌర్యరస ప్రధానమై సంభ్రమాశ్చర్యముల కల్గించు కథలు, భారత దేశ చరిత్రలో మరెచ్చటను కానరావు. విజయమో వీరస్వర్గమోయని అభిమాన గౌరవముల ప్రాణములుగ భావించి, ప్రాణముల తృణములుగ వర్జించగల్గిన మహనీయులే! రాజస్థాన్‌యందలి ప్రతి అంగుళము స్వాభిమానసంపన్నులైన రాజపుత్రువీరుని రుధిరోష్ణమును చవిచూచినట్టిదే. రాజస్థాన్ యందలి ప్రతి ప్రాచీనకట్టడము, ఒడలు జలదరింపచేయునట్టి గాథలను వర్ణించునవే!








# జైపూర్

రాజస్థాన్ రాజకీయ కేంద్రము జయపూర్. దక్షిణమునగాక తక్కిన మూడుదిశలందును కొండలు. ఆ కొండలపైగల బ్రహ్మాండమైన కోటలు, నగరరక్షణకై చుట్టును పదునెనిమిదవ శతాబ్దమున నిర్మించబడిన పెద్దగోడ, నగరమధ్యమున నిల్చిన మహారాజు సౌధము, ఆ సౌధము చుట్టునుగల పూలతోటలు చూడదగిన ముఖ్యప్రదేశములు.



1728లో స్వామి జయసింగ్ మహారాజు నిర్మించుటచే ఈ నగరమునకు జయపూర్ అని పేరువచ్చినది. నక్షత్రమండలమును గురించి పరిశోధనలు సాగించుటకై అతడొక పరిశోధనాకేంద్రమును, ఆనాడు రణరంగములందు వారుపయోగించుచున్న ఆయుధములు, అపూర్వగ్రంథముల వ్రాతప్రతులు, తివాచీలు, చిత్రపటములు నేటికిని యాత్రికుల కందుబాటులో హవామహల్ అను మహాసౌధమునందు పదిలపరిచినారు. రామ్‌నివాస్ గార్డెన్లు, ఆల్‌బర్ట్‌హాల్, మ్యూజియం చూడదగిన మరికొన్ని తావులు. రత్నములు చెక్కుటకు, నగిషి పనులు చేయుటకు జయపూర్‌నందు గొప్ప కౌశలముగల పనివారు నేటికిని గలరు. జైపూర్ పరిసరము లందు పేర్కొనదగినది ఏడుమైళ్ళ దూరమునగల అంబర్ అను శిథిలపట్టణము 1600 సం॥న నిర్మించబడిన ఈ పట్టణమందుగల ముఖ్యసౌధము, హాల్ ఆఫ్ విక్టరీ జైగార్ కోట ఒకనాడు ప్రాముఖ్యత కల్గినట్టివి.






# ఉదయపూర్

సిటీ ఆఫ్ సన్ రైజ్ అని, వెనిస్ ఆఫ్ ది ఈస్ట్ అని పేరుగన్న ఉదయపూర్ రాజస్థాన్‌యందలి ప్రసిద్ధ మహాసౌందర్యవంతమైన పరిసరములను, బ్రహ్మాండమైన సుందర సరోవరతీరమున స్వచ్ఛమైన తెల్లటి పాలరాతితో నిర్మించబడిన భవంతుల వరుసలతో, అత్యంతాకర్షణీయమైయున్నది. భవంతు లన్నింటిలో సుందరమైనది మహారాణా భవంతి. రకరకముల చిత్రములతో, ఫలకములతో, చెక్కడములతో, ద్వారములతో, గోపురములతో కన్నులకు పండుగచేయునీ రాజసౌధము. మహారాణా భవనముతో సరితూగగల జాగ్‌మందిర్, జాగ్‌నివాస్ మొదలైన భవనములు రమణీయముగనుండును. మొగల్ పాదుషాతో పోట్లాడి తిరుగుబాటు లేవదీసిన యువరాజు ఖుర్రం జాగ్ మందిర్‌నందే కొంతకాలము తలదాచుకున్నాడు. ఆపిమ్మట సింహాసనము చేజిక్కించుకొని, షాజహాన్ అను బిరుదుతో పాలించి చరిత్ర ప్రసిద్ధుడైనాడు ఖుర్రం. సంవత్సరమందన్ని కాలములందు పచ్చగ కలకలలాడుచుండు తోటలు ఉదయపూర్ నందు గలవు. ఇవిగాక 17వ శతాబ్దములో మహారాణా జగత్‌సింగ్ నిర్మించిన జగన్నాథదేవాలయము, త్రిముఖద్వారము ముఖ్యమైనవి. ఈ త్రిముఖ ద్వారము చెంతనే మహారాణాలు తమంత బరువుగల బంగారమును తూచి బీదలకు పంచిపెట్టుచుండెడివారు. సుజన్‌ఘర్ అను కొండపూ నుండి ఉదయగిరినంతను స్పష్టముగ చూడవచ్చును. శత్రువుబారినుండి తప్పించుకొని ఆత్మగౌరవమును కాపాడుకొనుటకై అగ్నిజ్వాలలకు ఆహుతైపోయిన వీరాంగనల సంస్మృతికై ఉదయపూర్‌కు రెండుమైళ్ళ దూరమున నిర్మలమైన పాలరాతితో నిర్మించబడిన కట్టడములు గలవు. సముద్రమట్టమునకు 2,500 అడుగుల ఎత్తునగల ఉదయపూర్ శీతోష్ణస్థితి సౌమ్యముగనుండును. ముఖ్యముగా శీతాకాలము ఆహ్లాదకరముగ ఉండును.








# చితోర్‌ఘర్

రసపుత్రవీరుల రుధిధారలు చితోర్‌ఘర్‌నందువలె మరెచ్చటను స్రవించలేదు. పరదేశీయునెదిరించి ప్రాణప్రదమైన స్వాతంత్ర్యమును కాపాడుకొనుటకై లక్షలాది చితోర్‌ఘర్ వీరులు ఆత్మార్పణము గావించినారు. మూడు పెద్ద దండయాత్రలను చవిచూసి నాశనమైపోయి చితోర్‌ఘర్‌వాసులు నగరమును వదలి ఉదయపూర్‌కు తరలిపోయినారు. అప్పటికి కోటలో కొన్ని భాగములు విజయస్థంభము మాత్రము మిగిలినవి.



# జోధ్‌పూర్

కొండప్రాంతమందు నిర్మించబడిన ఈ నగరము చుట్టును ఆరుమైళ్ళ పొడవుగల ప్రహరీగోడ, ఏడుద్వారములు గలవు. చరిత్ర ప్రసిద్ధమైన కట్టడములేకాక ఇటీవల అధునాతన పద్ధతులలలో నిర్మించబడిన అనేక సుందరసౌధములుగలవు. సిల్కు, దంతపుపనులకు ఆ ప్రాంతమందలి వర్తక వాణిజ్యములకు కేంద్రముగనున్నది జోధపూర్. చూడదగిన ప్రదేశములలో నూరుస్థంభముల గుడి, నగర పరిసరములందుగల కైలానా, బాల్‌సమంద్ సరస్సులు, మ్యూజియం, గ్రంథాలయము, స్త్రీలకై ప్రత్యేకించబడిన గార్డెన్, క్రీడావేదిక పేర్కొనదగినవి. జోధపూర్‌కు ఉత్తరమున 5 మైళ్ళ దూరములో మార్వార్ రాజ్యమునకు ఒకనాటి రాజధానియైన మండోర్ గలదు. పరీహార్ రాజపుత్రులనోడించి రాతోడ్ రాజపుత్రప్రభువు రావ్‌చందా అనువాతడు **1381** లో మండోర్‌ను స్వాధీనపరచుకొని తన రాజధానిగ చేసుకొనెను. జోధపూర్ నిర్మాణము పూర్తియైన పిమ్మట మండోర్‌నుండి రాజధాని జోధపూరుకు మార్చబడినది. మండోర్‌లో ఒకేరాతిపై వీరాధివీరులని ఖ్యాతిగాంచిన **16** మంది రాజపుత్రుల చిత్రములు చెక్కబడియున్నవి.





## బికనీర్

దీని చుట్టును గూడ బ్రహ్మాండమైన గోడ గలదు. 1488లో నిర్మించబడిన ఈ నగరమందనేక సుందరభవనములు, చూడదగిన కట్టడములు గలవు. పదునారవ శతాబ్దాంతమున రాజారాయంగ్‌చే నిర్మించబడిన బికనీర్ కోటయందు అనేక గొప్ప భవనములతోపాటు సంస్కృత, పర్షియన్ గ్రంథాలయములు గూడ గలవు. జైనుల దేవాలయములు, సమాధులు కొన్ని కోటకీవల కన్పించును. తివాచీల పరిశ్రమకు ఈనాటికీ బికనీర్ పేరు కలిగియున్నది.

## అజ్మీర్

పన్నెండవ శతాబ్దమందు అజయరాజను ప్రభువు అజ్మీర్ నగరమును నిర్మించినాడు. ఇందే మొగల్‌సామ్రాట్టు అక్బర్ తారాఘర్ అను గొప్ప కోటను నిర్మించినాడు. ఈనాడు ఆ కోటను మ్యూజియముగ ఉపయోగించుచున్నారు. ముస్లిం ప్రముఖుడు మొయినుద్దీన్ చిష్టీ యొక్క సమాధిని దర్శించుటకై విరివిగా మహమ్మదీయులిచటకు వచ్చుటగలదు.

## భారత్‌పూర్

ఆంగ్లేయులతో పోరుచు ముట్టడుల నెదుర్కొని చాలాకాలము నిల్చిన ప్రసిద్ధమైన కోట భారత్‌పూర్‌నందు గలదు. పట్టణమునకు మూడుమైళ్ళ దూరమున పక్షులవేటకు మిక్కిలి ఉపకరించు వనము గలదు.

రాజస్థాన్‌లోగల ముఖ్య ప్రదేశములలో ఆల్వార్, కోటహ్, బుండి మరికొన్ని.




## ఉత్తర భారతము

సుదీర్ఘమైన నదీ ప్రవాహములతో సారవంతమైన సశ్యశ్యామలమై వాసయోగ్యములైన మైదానములతో దర్శనీయమైనది ఉత్తర భారతము. ఉత్తరమునగల హియాలయములందుగల కాంగ్రా, కులూ లోయలు యమునానదికి పశ్చిమమున గల పంజాబ్, యమునా తీరముపైగల భారతరాజధాని ఢిల్లీ, నదికి తూర్పునగల ఉత్తరప్రదేశపు మైదానములు, ఆగ్రాలో షాజహాన్ నిర్మించిన తాజ్‌మహల్, గంగానదీ తీరమునగల హైందవ పుణ్యక్షేత్రము బెనారస్ మొదలైన ప్రదేశములెన్నియో చూడదగియున్నవి.

## అమృతసర్

సిక్కులకు అతిపవిత్రమైన బంగారు దేవాలయము అమృతసర్‌న గలదు. సిక్కుల గురుపరంపరలో నాల్గవ వాడైన రామదాసు, ఒక పెద్దతటాకమును త్రవ్వి ఈ నగరమునకు శంఖుస్థాపన చేసెను. తరువాతి గురువు అర్జునదేవుడు బంగారు దేవాలయమును నిర్మించెను. సిక్కుప్రభువు రంజిత్ సింగ్ దేవాలయ గోపురమునకు రాగి తొడుగును, గోడలకు బంగారుపూతను వేయించెను. తటాకముచుట్టు పాలరాతి ప్రహరీ గలదు. తటాకమునకు మధ్యగల దేవాలయమందు సిక్కుల పవిత్రగ్రంథమైన గ్రంథసాహెబా ఒక సిల్కు కంబళమున చుట్టబడి పదిలపరచబడి ఉన్నది.







## కులు-కాంగ్రా లోయలు

భూలోక స్వర్గమని వర్ణింపబడుచున్న కాశ్మీరపు సౌందర్యమునకు సరితూగగల ప్రకృతి దృశ్యములు కులు-కాంగ్రా లోయలందు చూడగలము. హిమాలయము లందలి ధౌలాధార్ పర్వతముల క్రిందభాగమున ఈ లోయలు గలవు. ఏపిల్ తోటలు, రాజపుత్రుల కోటలు, హిమగిరి శిఖరములు, చక్కటి వాతావరణముతో మిక్కిలి ఆహ్లాదకరముగ నుండును. కంగ్ర, జోగీందర్‌నగర్, చంబా, ధర్మశాల, డాల్‌హౌసి, కులు ఈ లోయలందలి ముఖ్యమైన విశ్రాంతి కేంద్రములు, బన్‌గంగ ప్రవాహప్రాంతమున సముద్రమట్టమునకు 2,500 అడగుల ఎత్తున గలదు కాంగ్రా. మంచు కరిగి వరవడితో పరుగెత్తుప్రవాహముల సహాయమున విద్యుత్తును పుట్టించు కేంద్రమొకటి జోగీందర్‌నగర్‌లో గలదు. డాల్‌హౌసీ నుండి చంబావరకు గల రాజబాటపై పయనించినచో ప్రపంచమందలి మహాసౌందర్యవంతమైన అరణ్యములలో ప్రముఖములని వాసిగన్న అడవులను చూడవచ్చును. ఇందు విరివిగా ఎలుగుబంట్లు, చిరుతపులులు కన్పించుచుండును.






## సిమ్లా

హిమాలయపర్వతముల దిగువ భాగములో సముద్ర మట్టమునకు 7000 అడుగుల ఎత్తున మనోజ్ఞమైన హిమగిరి శిఖరముల మధ్య నిర్మించబడినది సిమ్లా. కల్కా నుండి రైలు మీద సిమ్లాకు ప్రయాణము చేయునపుడు ప్రకృతి సౌందర్యమంతా ప్రసన్నముగా కన్పించును. సిమ్లాకు కారుపై గూడా పోవచ్చును. గాని, రైలు ప్రయాణమే ఆహ్లాదకరమైనది. అన్నాందలెయందలి పోటీ క్రీడలు, వేటకు అనువైన వనరులు సిమ్లా యందు గల ప్రత్యేకాకర్షణలు. ఇటీవలి వరకు సిమ్లా భారత దేశమునకు వేసవి రాజధానిగ నుండెను.




## ఢిల్లీ

భారత రాజధాని ఢిల్లీ. ఈనాడు స్వతంత్ర భారత రాజధాని నిర్మింపబడిన ప్రదేశమున శతాబ్దములతరబడి అనేక భవనములు కట్టబడి నేలగలిసినవి. అనేక కోటలు పేటలు తారుమారైనవి. ఎందరో రాజులు, ఎన్నియో సామ్రాజ్యములు పాలించి కాలగర్భమున కలిసిపోయిరి. పృథ్విరాజ్ నిర్మించిన నగరము, కుత్ బుద్దీన్ రాజధాని, అల్లాఉద్దీన్ నివాసము, అనేకమంది సుల్తానులు, మొగలాయీ పాదుషాలు, ఆంగ్లేయులు, పాలించి గతించిన రాజధాని.



భారతదేశచరిత్రలో ఢిల్లీ కంటే ప్రాముఖ్యత గల పట్టణము లేదు. ఈనాడు పాతఢిల్లీ అని పిలువబడుచున్న షాజహానాబాద్ నందు అనేక ప్రాచీన కట్టడములు కలవు.




ఎర్రకోట ఈనాటికిని నగరమందు ముఖ్య ప్రాంతమై, ఒకనాటి మొగల్ సామ్రాజ్య వైభవ ప్రాభవములకు ప్రతినిధిగా నిల్చియున్నది. ఆనాటి షాజహాన్ దర్బారు ఎంతటి వైభవమును పాలించినదో ఈనాటికిని కన్నులకు గట్టినట్లు కన్పించుచుండును.




ఎర్రకోటలో ముఖ్యమైనవి రెండు మందిరములు. అందు పర్షియన్ భాషలో ఇట్లు వ్రాయబడియున్నది. ''భూలోకము నందెచ్చటైన స్వర్గమున్నచో అది ఇచటనే గలదు! ఇచటనే గలదు!! ఇచటనే గలదు!!!' ఇందు అతిశయోక్తి గాని, అత్యుక్తి గాని లేదనిపించును. రంగమహల్, హమామ్, పెరల్ మశీదు, మ్యూజియం గల ముంతాజ్ మహల్ మొదలైన భవనములు నేటికీ మహావైభవమున దీపించుచున్నవి. ఎర్రకోట నుండి ఫతేపూర్ మసీదునకు పోవు మార్గమున చాందినీ చౌక్ గలదు. వెండి, బంగారు ఆభరణములు, నవరత్నములు అచట విరివిగ అమ్మబడు చుండును. రోడ్డున కిరుప్రక్కలను అసంఖ్యాకములైన విక్రయశాలలందు రాసులు బోసినట్లు అశేష సంపద కన్నులకు మిరుమిట్లు గొల్పుచుండును. చాందినీచౌక్‌నకు కొద్దిగ దక్షిణమునకు పోయినచో విశ్వవిఖ్యాతమైన జమామశీద్‌ను చూడగలము. నగరమునకు దక్షిణమున ఎర్రటి ఇసుక రాతితో నిర్మించబడిన హుమాయూన్ పాదుషా సమాధి గలదు.







ఇవిగాక పన్నెండవ శతాబ్దమునకు చెందిన కుతుబ్ మినార్, నాల్గవ శతాబ్దమునకు చెందిన ఇనుప స్థంభము, ఇటీవలి నిర్మాణములలో తీర్చిదిద్దినట్లు చెట్ల వరుసలతో రమ్యముగ కన్పించుచౌకులు, పార్లమెంటు భవనము, కేంద్ర ప్రభుత్వ కార్యాలయము, రాష్ట్రపతి భవనము, లక్ష్మీనారాయణ దేవాలయము పేర్కొనదగినట్టివి. యమునకు కుడి ప్రక్కన మహాత్ముని సమాధిగలదు. దీనిని 'రాజఘాట్' అందురు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పురుషులు, అసంఖ్యాకముగ ప్రజలు, మహాత్ముని సమాధిని దర్శించుటకు ప్రవాహముగ వచ్చుచుందురు. ప్రతి శుక్రవారము అచట పూజ్య బాపూజీ సంస్మృతికై ప్రార్థనలు జరుగుచుండును. ఇచట ఇంకను బ్రహ్మాండమైన కట్టడమును మహాత్ముని జ్ఞాపకార్థముగ నిర్మించుటకు భారత ప్రభుత్వము ప్రయత్నము చేయుచున్నది.




## ఆగ్రా

యమునా నదిపై గల ఈ సుందర నగరమును 1526లో బాబరు వశపరచుకొనినట్లు, ఆ పిమ్మట అక్బర్ పాదుషా దీనిని తన రాజధానిగా చేసుకొని కోటను నిర్మించి కొంత కాలము సామ్రాజ్యమును పాలించినట్లు చరిత్ర చెప్పుచున్నది. ఇచటనే అక్బర్ మనుమడు, షాజహాన్ తన ప్రియమైన భార్య జ్ఞాపకార్థము విశ్వవిఖ్యాత సుందర మందిరమైన తాజ్ మహల్‌ను నిర్మించినాడు. 1630 సం॥లో ప్రారంభమైన ఈ మహా నిర్మాణము








పదునెనిమిది సంవత్సరములు సాగి, వేలాది కార్మికుల నిర్విరామకృషితో కోట్లాది రూప్యముల ఖర్చుతో మహాశిల్పుల దీక్షతో, **1648** నాటికి పూర్తి చేయబడినదట! తెల్లటి స్వచ్ఛమైన పాలరాతితో నిర్మించబడిన ఈ అపూర్వ మందిరమున చక్రవర్తి షాజహాన్ - ముంతాజ్ మహల్‌ల సమాధులు గలవు. తాజ్‌మహల్ లోపల గల చిత్రములన్నియు అమూల్య కళాఖండములే. ప్రపంచమందలి మహాద్భుతములలో ఒకటని, భారతదేశమునకు దివ్య భవనమని కీర్తించబడుతున్న తాజ్‌మహల్ సౌందర్య సౌభాగ్యమును చూడవలసినదేగాని వర్ణించుట ఎంతటి భావకునికైనను అసాధ్యవిషయము.



## కాశి

గంగానదీ తీరమున మూడువేల సంవత్సరములనాడు నిర్మించబడి పురాణ గాథలందునూ, చరిత్ర కథలందును సుప్రసిద్ధమై, హైందవ జాతికి పరమ పూజనీయమైన పుణ్యక్షేత్రమై దేవాలయమై, ఆరాధింపబడుచున్న పురాతన నగరము 'కాశీ' జీవితము నందెన్ని పాపములు చేసినను ఈ క్షేత్రమును దర్శించి, ఇచట గంగలో స్నానము చేసి, ఇచటి దేవునికి ప్రణామమాచరించినంత మాత్రమున సకల పాపములు మాయమై, జీవితము పావనమై, జీవి తరించునని అనుశ్రుతముగ గాథలను చెప్పుకొన్నదీ హైందవజాతి. ప్రాచ్యకళలకు, సంస్కృత విద్యకు ప్రముఖ కేంద్రముగ, శతాబ్దములనుండి పేరు ప్రఖ్యాతులనార్జించినది కాశి. ఈనాటికి కాశీ పండితులకు దేశమున గొప్ప గౌరవము కలదు.





# కాశ్మీర్

అసంఖ్యాకములైన అరణ్యములతో, భారతదేశమునందింకెచ్చటను గానరాని సౌందర్య సర్వస్వములనదగిన తోటలతో, సరస్సులతో, నదులతో, నింగినంటు హిమగిరి శిఖరములతో భూలోక స్వర్గమని కొనియాడబడుచున్నది కాశ్మీర్. మొగలాయి చక్రవర్తులు నాటి పెంచిన తోటలు శ్రీనగర్ పరిసరములందు గలవు. డాల్ సరస్సు ప్రాంతమున నిషాత్ గార్డెన్లు, నాశీమ్‌బాగ్ తోటలు గలవు. కాశ్మీరు ముఖ్య నగరమైన శ్రీనగర్ జీలమ్ నదీ తీరమున నిర్మించబడినది. నదికిరుప్రక్కల గల జనపదములునేకము జేయుటకై ఏడు వంతెనలు నిర్మించబడినవి. శీతాకాలపు ఆటలకు కేంద్రమైన గుల్‌మర్గ్ సముద్రమట్టమునకు **8,700** అడుగుల ఎత్తున గలదు. కాశ్మీరమందలి విశ్రాంతివిడుదలన్నింటిలో ఇది ప్రముఖమైనది. పుణ్యక్షేత్రమైన అమర్‌నాథ్‌కు పోవు మార్గమందు పహేల్‌గామ్ అను మరొక విడిది గలదు. ఇంకనూ ఖిలేన్‌మార్గు, కోకర్నాగ్, అచబాల్ మొదలైన విశ్రాంతి కేంద్రములు చూడదగియున్నవి. మనదేశమందు గల సరస్సులన్నింటిలో పెద్దదైన వులార్ సరస్సు, కలువపూలకు ప్రసిద్ధిగన్న మానసబాల్ సరస్సు పేర్కొనదగినవి. యాత్రికులనాకర్షించు ఈ సుందర ప్రదేశములకు తోడుగ ప్రాచీన దేవాలయములు, పురాతన కట్టడములు, మశీదులు, బౌద్ధారామములు, కాశ్మీరమందంతట ఎడనెడ కన్పించుచుండును. లడక్ తూర్పు ప్రాంతమునందలి బౌద్ధారామములు, శ్రీనగర్ పరిసరమున గల కొండపై వేయి అడుగుల ఎత్తున గల శంకరాచార్యుల ఆలయము, ట్రీక్ పీఠభూమిపై ప్రాచీన భారతీయ, గ్రీక్ శిల్ప కళాసంపదను మేళవించి నిర్మించిన, మార్తాండాలయము, డాల్‌లేక్ సమీపమున గల హజరత్ బాల్ మశీదు, **1404**లో నిర్మించబడిన కాశ్మీరమందుగల మశీదులన్నింటిలో గొప్పదని, పెద్దదని పేరుగన్న జమ్మామశీద్ అపూర్వమైన చిత్రములతో, శిల్పములతో గొప్ప కళాకేంద్రముగా పరిగణింపబడుచున్న షాహమదాన్ మశీదు కాశ్మీరమునకు మరికొన్ని ఆభరణములై అలరారుచున్నవి.



ప్రకృతి సౌందర్యము, ఆహ్లాదకరమైన వాతావరణము కాశ్మీర్ ప్రజలను సౌందర్యారాధకులుగా మార్చినది. కళాకేంద్రములనదగిన కుటీర పరిశ్రమలు, అనేక మంది ప్రజలకు జీవనాధారములైనవి. కుట్లుపని, కర్రపని, వెండి నగిషీపని, సిల్కు నేత, లోహపు పనులు, కంబళీల తయారీ మున్నగు కుటీర పరిశ్రమలకు కాశ్మీరము పెట్టిన పేరైనది. పందొమ్మిదవ శతాబ్దమున కాశ్మీర్ శాలువలు యూరప్ నందు విరివిగా వాడబడుచుండెడివి. ఈనాటికి శాలువల తయారీలో కాశ్మీర్ అగ్రస్థానమలంకరించియున్నది. ప్రతి సంవత్సరమందును కాశ్మీర్ ప్రభుత్వము బ్రహ్మాండమైన పారిశ్రామిక వస్తు కళా ప్రదర్శనము నేర్పాటు చేయుచుండును. ఈ సందర్భమున కాశ్మీరమందలి అత్యుత్తమ కళాసంపద మనోజ్ఞముగ ప్రదర్శింపబడును. కాశ్మీరమును దర్శింపగోరువారు ఈ ప్రదర్శన కాలమునకు అచటకు జేరునట్లు కార్యక్రమమును ఏర్పాటుచేసుకొనినచో ప్రయోజనముండును.


దీనికి తోడుగ మనము కాశ్మీరమందలి మ్యూజియమును దర్శించి గత శతాబ్దము లందలి కాశ్మీరపు వైభవ ప్రాభవములు తెలుసుకొనవచ్చును. ఈ మ్యూజియమును గూడా ప్రభుత్వమే మిక్కిలి శ్రద్ధాసక్తులతో నిర్వహించుచున్నది.

'పడవ ఇండ్లు' కాశ్మీరమందుగల ప్రత్యేకాకర్షణ. పడవలనే గృహములుగ తీర్చిదిద్దుకొని అనేకులు నివసించుచుందురు. యాత్రికులకు వినోదార్థము కావలయునన్నచో ఇట్టి గృహములు లభించగలవు. నీటి అలలపై తేలుచు నిర్మల శీతలవాయువులు పీల్చుచు ప్రశాంత ప్రకృతి సౌందర్యమును తిలకించుచు యాత్రికులు కాశ్మీరమునందు అమూల్యమైన సౌఖ్యమును పొందగలవు.



# ప్రాగ్భారతము

మనదేశపు తూర్పు భాగమునందు హిందువులకత్యంత పూజనీయమైన గంగానది ప్రవహించుచున్నది. హిమాలయములందలి గంగోత్రిలో పుట్టి 1,500 మైళ్ళు ప్రయాణము సాగించి బంగాళాఖాతమున కలియుచున్న ఈ గంగాతరంగిణి యందలి ప్రతి నీటి బిందువును హిందువులు పవిత్రమైనదిగా భావింతురు. గంగానదీ మైదానమునకు ఉత్తరమున గల మహోన్నత హిమగిరి శిఖరములు, పశ్చిమ బంగాళమునకు వేసవి విడిదియై టిబెట్‌తో మనదేశమునకు జరుగు వర్తక వాణిజ్యములకు మజలీయైన డార్జిలింగ్ కావలసినంత వర్షపాతము గలిగి పెద్ద నదులతో సారవంతమైన మైదానములతో అడుగడుగున కనిపించి వరిచేలతో, మామిడితోటలతో, వెదురువనములుతో, కొబ్బరి చెట్ల గుంపులతో దర్శనీయమైనది తూర్పుఇండియా. అస్సాంనందు తేయాకు తోటలు గలవు. జనపనారను విశేషముగ పండించు నేలలు, కలకత్తాయందలి అసంఖ్యాకములైన ఫ్యాక్టరీలకు జనపనారను సరఫరా చేయుచున్నవి. ఈ ప్రాంతమున విశేషముగ బొగ్గు, ఇనుము, మైకాగనులుండుటచే పరిశ్రమలకు కీలకమైనది. ఇచ్చట లభించు ఖనిజములు మన కీలక పరిశ్రమలను నిర్మించి పోషించు చున్నవి. ఈ ప్రాంతమునందింకనూ అనేక పారిశ్రామిక పథకములు అమలు జరుపుచున్నారు. వీటిలో ప్రముఖమైనది దామోదర్ లోయ పథకము.




## బుద్ధ గయ



తూర్పు ఇండియాలో చూడదగిన యాత్రాస్థలములలో బుద్ధగయ ఒకటి. శాక్య వంశజుడైన గౌతముడిచ్చటనే ఒక చెట్టు క్రింద గూర్చుని తపమాచరించి జ్ఞానసిద్ధి పొంది బుద్ధుడైనాడు. ఆనాటినుండి ఇది గొప్ప పుణ్యక్షేత్రమైపోయినది. మౌర్య చక్రవర్తి అశోకుడు కళింగయుద్ధానంతరము ఆయుధములు విసర్జించి ధర్మదీక్షను బొంది బుద్ధగయయందలి పుణ్యవృక్షము చెంతనే ఒక దేవాలయమును నిర్మించినాడు. అది కాలవశమున శిథిలమై తిరిగి పదకొండవ శతాబ్దమున పునరుద్ధరించబడినది. గౌతముడు కూర్చొనిన వజ్రాసనముగాని, ఆనాటి బోధి వృక్షముగాని నేడు లేకపోయినను ఆ మహనీయుని సంస్మృతికై వేలాది యాత్రికులు ప్రతి సంవత్సరము బుద్ధగయను దర్శించుచుందురు.

## నలంద

ప్రాచీన భారత దేశచరిత్రలో ప్రముఖ బౌద్ధ విశ్వ విద్యాలయమని పేరుగన్న నలంద అయిదవ శతాబ్దమున స్థాపించబడి ఏడు శతాబ్దములపాటు ప్రపంచమందలి ప్రముఖ విద్యా కేంద్రములలో ఒకటిగ విరాజిల్లి చైనా యాత్రికుడు హూయాన్‌సాంగ్ వంటి విద్యార్థులనెందరినో దేశదేశములనుండి ఆకర్షించి విద్యల నేర్పించి విజ్ఞాన పరిషత్తుల నిర్వహించి క్రమముగా కాలగర్భమున కలిసిపోయినది నలందా. భారత ప్రభుత్వపు పురాతన వస్తు పరిశోధన శాఖవారు ఈ ప్రాంతమును త్రవ్వి ఇచ్చటి శిథిలములను వెలికితీసి పరిశోధనలు సాగించి పదిలపరచుచున్నారు.






# కలకత్తా



పదిహేడవ శతాబ్దమున నామమాత్రముగ కుగ్రామమైన కలకత్తా పదింతలై, నూరింతలై పెరిగి పెరిగి ఈనాటికి ప్రపంచమందలి మహానగరములలో ఒకటైనది. తూర్పు దేశములందు పెద్ద రేవు పట్టణమై వర్తక కేంద్రమైనది కలకత్తా. పశ్చిమ బంగాళము పరిసర రాష్ట్రములందలి సరకులన్నియు కలకత్తా రేవు నుండి ఎగుమతి చేయబడుచున్నవి. ప్రపంచమునందెల్ల పెద్దదైన జనపనార పరిశ్రమకు కేంద్రమై అసంఖ్యాకములైన నూనెమిల్లులతో, కాగితపు మిల్లులతో లోహపు కర్మాగారములతో భారత దేశమందు ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రమైనది కలకత్తా.

ప్రప్రథమమున ఆంగ్లేయులు ఆక్రమించినపుడు నిర్మించబడిన విలియమ్ ఫోర్టు నగరమధ్యమున గల మైదాన్ పార్కు, విక్టోరియా మెమోరియల్, రెండుమైళ్ళ పొడవున పెద్ద పెద్ద విక్రయ శాలలతో వర్తక కేంద్రమైన చౌరంగీ, దానికి ఉత్తరమున గల ప్రభుత్వ కార్యాలయము, జియోలాజికల్ గార్డెన్లు చూడదగిన ముఖ్యప్రదేశములు. కలకత్తా యందు మొట్టమొదట నిర్మించబడిన సెంట్ జాన్ చర్చి, కాళీఘాట్ దేవాలయము, జైన దేవాలయము, బేలూరు మఠము, స్వామీ వివేకానంద మిషన్, శ్రీరామ కృష్ణ పరమహంస నివసించిన దక్షిణేశ్వర దేవాలయము, 1786లో నాటబడిన బొటానికల్ గార్డెన్లు, ఇటీవల అద్భుత నిర్మాణ కౌశలముతో కట్టబడిన హౌరాబ్రిడ్జి, కలకత్తాయందుగల మరికొన్ని ఆకర్షణలు.



## శాంతి నికేతన్

హౌరాకు నూరుమైళ్ళు దూరాన గల బోల్‌పూర్ స్టేషన్ ఒకనాడు అనామకమైనదైనను ఈనాడు విశ్వవిఖ్యాతమైనది. ఈ స్టేషన్‌కు రెండు మైళ్ళ దూరమున మహాకవి రవీంద్రనాథ్ టాగురు స్థాపించిన విశ్వభారత విశ్వవిద్యాలయము గలదు. విద్యా విధానములందు ఒక విప్లవమును తెచ్చి ఒక ప్రత్యేకత నార్జించుకొని దేశదేశములనుండి మహామేధావులనెందరినో ఆకర్షించుచున్నది ఈ విశ్వభారతి. రవీంద్ర కవీంద్రుడార్జించినంత యశస్సు నవీన భారతీయ కవులలో మరెవ్వరును సాధించలేదు. ఈతడు రచించిన గీతాంజలి అను పద్య కావ్యమునకు నోబెలు బహుమానము లభించినది. ఆగర్భ శ్రీమంతుడైనను నిరాడంబరమైన ప్రశాంతజీవితమును గడిపి తానొక సంస్థయై చిరస్మరణీయుడైన మహా పురుషుడు రవీంద్రుడు. ఆ రవీంద్రుని సృష్టి విశ్వభారతిని నెలకొల్పిన శాంతినికేతన్. శాంతినికేతన్‌లో రవీంద్రుడు నివసించిన ‘రవీంద్ర భవనము’ నందీనాటికి అతడుపయోగించిన వివిధ వస్తువులు, అతని రచనల వ్రాతప్రతులు చిత్రములు పదిలపరచబడియున్నవి.

## డార్జిలింగ్

మహారణ్యముల మధ్యమున గంభీరమై, సుందరమై, సుఖప్రదమైన వేసవి విడిది డార్జిలింగ్. ఇచటనుండి హిమాలయముల మహాద్భుత సౌందర్యమును స్పష్టముగ చూడవచ్చును. డార్జిలింగ్‌కు ఏడుమైళ్ళ దూరమునగల టైగర్ హిల్‌నుండి ప్రపంచమందలి మిక్కిలి ఎత్తు గల గౌరీ శంకర శిఖరమును చూడవచ్చును. డార్జిలింగ్ పరిసరములందనేక కుగ్రామములందు నివసించుచున్న కొండజాతులను, వారి ఆచార వ్యవహారములను, వేష భాషలను చూచుట విచిత్రమైన అనుభవము. లెప్చాలు, భూటియాలు, టిబెటన్లు, నేపాలీయులు మొదైలన అనేక తెగలవారిచ్చట కన్పించుచుందురు. కలకత్తా నుండి రైలుపై డార్జిలింగు చేరుటకు 369 మైళ్ళు ప్రయాణము చేయవలసియున్నది. 51 మైళ్ళ దగ్గరకు వచ్చిన తరువాత రైలు క్రమక్రమముగ ఎత్తున కెక్కుచుండును. ఇంజనీర్ల మేధాశక్తిని చూపు ఈ రైలు మార్గము అతి వ్యయప్రయాసలకోర్చి నిర్మించబడినది.





## దక్షిణ భారతము


ఎక్కువ జనసమ్మర్ధము కలిగి సారవంతమైన, భాగ్యవంతమైన ప్రాచీన నాగరికతలకు, కళలకు, సంస్కృతికి నిలయమైనది దక్షిణ భారతము. కొబ్బరి తోటలతో, కొండల వరుసలతో, నీటివనరులతో, ప్రశాంత వాతావరణముతో కన్పించునది మలబార్ తీరము. బ్రహ్మాండమైన సంరంభముతో దసరా వంటి పండుగలను చేసుకొనునది మైసూర్. అందమైన కుటీర పరిశ్రమలు, కొండలు, అడవులు, జోగ్ జలపాతము, ఉదక మండలము, కూనూర్, కోట గిరుల వంటి వేసవి విడుదులు, సస్య శ్యామలమైన కోరమాండల్ తీరము. అసంఖ్యాకములైన ప్రాచీన దేవాలయములు, కట్టడములు, కోటలు మొదలైన ఆకర్షణలతో చూపరుల నాహ్వానించు దక్షిణ భారతము ద్రవిడ నాగరికతకు కేంద్రమైనది.

## మద్రాసు (చెన్నై)


దక్షిణ భారతమునకు కేంద్రమనదగిన నగరము మద్రాసు, ఇది భారత దేశమందు మూడవ స్థానమాక్రమించినది. తక్కిన నగరముల వలె కాలక్రమమున రూపు రేఖలను కోల్పోవక ప్రాచీన సంప్రదాయములను స్వరూపమును కొంత వరకు నిలుపుకొనుచున్న గౌరవము మద్రాసు నగరమునకు గలదు.

అడయార్ నుండి సముద్రమునకు ఎనిమిది మైళ్ళ పొడవున





వ్యాపించినదీ నగరము. ఇంకను దినదినము అభివృద్ధి చెందుచున్నది. నాపియర్ బ్రిడ్జి నుండి - శాంథోమ్ నందలి రోమన్ కాథలిక్ చర్చి వరకు వ్యాపించిన సముద్రతీరము నగరమున గల ముఖ్యమైన ఆకర్షణ.




**1640**లో ఈస్టిండియా కంపెనీ ప్రముఖుడైన ఫ్రాన్సిస్‌డే అనునాతడు సెంట్ జార్జ్ కోటను, అందు సెంట్ మేరీ చర్చిని నిర్మించినాడు. మద్రాసు నగరమందు అనేక హైందవ దేవాలయములు కూడా గలవు. హార్బర్ ప్రాంతమున **160** అడుగుల ఎత్తుగల లైట్ హౌస్ నుండి నగరమునంతను చక్కగా చూడవచ్చును. లా కళాశాల, మ్యూజియం, విక్టోరియా ఇన్స్టిట్యూట్, అడయార్ దివ్య జ్ఞాన సమాజము, అనేక సినిమా స్టూడియోలు నగరమందు చూడదగిన కొన్ని ప్రదేశములు.

మద్రాసునకు **35** మైళ్ళ దూరమున గల మహాబలిపురము గొప్ప విశ్రాంతి కేంద్రము. అయిదారు శతాబ్దములకు చెందిన అనేక శిల్ప కళాఖండము లచ్చటగలవు.

## మధుర

'పండుగల పట్టణము' అని ప్రసిద్ధిగన్న మధుర నగరము గ్రీసు - రోము మొదలైన దూరదేశములతో వర్తక వాణిజ్యములు సాగించి దక్షిణ భారత చరిత్రలో ప్రసిద్ధి చెందిన పాండ్య రాజ్యమునకు ముఖ్య పట్టణముగ నుండెడిది. పదిహేడవ శతాబ్దినాటి నాయకరాజుల కాలములో గొప్ప శిల్ప కళాఖండములనదగిన అనేక మహా నిర్మాణములు జరిగినవి. **150** అడుగుల ఎత్తుగల తొమ్మిది గోపురములతో, **850-750** అడుగుల







వైశాల్యముతో నిర్మించబడిన మీనాక్షి దేవాలయము, వేయి స్తంభముల గుడి, రాతి ఫలకములపై గల చెక్కడములు కన్నులవిందు చేయునట్టివి. తిరుమల నాయకుడనేక భవంతులను విశేషమైన ధనరాసులు వెచ్చించి నిర్మించినాడు. ఇవిగాక చేనేత బట్టలకు, కొయ్యసామానులకు ఈనాటికి పేరు నిలుపుకొన్నది మధుర.

## మైసూర్

సముద్ర మట్టమువకు రెండు మూడు వేల అడుగుల ఎత్తున నుండుటచే మైసూర్ వాతావరణము సమశీతలమై ఆహ్లాదకరమై ఆరోగ్యకరముగ నుండును. అశోకుని శాసనములలో నొకటి, మైసూరు నందు దొరికినది. దీనినిబట్టి ఆనాటికే ఇది ప్రముఖమైన పట్టణమని తెలియుచున్నది. ఆ పిమ్మట ఇచ్చట కదంబులు, హోయశాలలు, విజయున రాజులు విజయపతాకల నెగురవైచినారు. 11-12-13 శతాబ్దములలో హోయశాల ప్రభువుల ప్రోత్సాహముతో,మైసూర్ నందు గొప్ప నిర్మాణములు జరిగినవి. సోమనాధపూర్, బేలూర్, హాలిబిడ్ దేవాలయములందు ఆనాటి శిల్పుల ప్రజ్ఞా విశేషములను చూడగలము.

నవీన భారతమందనేక ముఖ్యమైన పరిశ్రమలు మైసూర్‌నందు స్థాపించబడినవి.



బెంగుళూర్‌నందలి హిందూస్థాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ-కోలార్ నందలి బంగారు గనులు భద్రావతి యందలి ఇనుము-ఉక్కు పరిశ్రమ, మైసూరులో మంచిగంధపు నూనె కర్మాగారము, సిల్కు, సబ్బు పరిశ్రమలు అందుకొన్ని.

రాష్ట్రమునకు రాజధానియైన బెంగుళూరు నందు బ్రహ్మాండమైన భవంతులు, తోటలు గలవు. చామరాజ్ సాగర్ అను సరస్సు నుండి స్వచ్ఛమైన మంచినీరు, నగరవాసులకు సరఫరా చేయబడుచున్నది. నగరమునకు 20 మైళ్ళ దూరమున గల ఈ సరస్సు దర్శనీయమైనది. సముద్రమట్టమునకు 4851 అడుగుల ఎత్తునగల నంది అను వేసవివిడిది బెంగుళూరుకు అనతిదూరములో నున్నది. బెంగుళూరు-మైసూరు రైలుమార్గముపై, మహారాజనివాసము, సుందర శివ సముద్ర జలపాతము చూడవచ్చును. ఇచట కావేరీ నది రెండు పాయలుగా చీలి రెండువందల అడుగుల ఎత్తు నుండి క్రిందకు మహావేగమున దూకుచున్నది. జలపాతము చుట్టును దట్టమైన అడవులతో నిండిన కొండలు గలవు. శివసముద్ర జలపాతము వద్ద నిర్మించబడిన జలవిద్యుత్కేంద్రము మైసూరునకు పుష్కలముగ విద్యుచ్ఛక్తిని సరఫరా చేయుచున్నది.

'గార్డెన్ సిటీ' అని పేరు పొందిన మైసూర్ చాముండీదేవి పేరిట గల కొండ ప్రాంతమున నిర్మించబడినది. అతి విశాలమైన వీధులు, సుందర సౌధములు, కోటలోపల గల మహారాజ భవనము నగరమునకు వన్నె తెచ్చుచున్నవి. మైసూరును దర్శించుటకు తగిన కాలము దసరా పండగ రోజులు. పది దినముల పోటీ పండుగ మహావైభవమున వేడుకలతో జరుగును. మైసూరు నుండి క్రిష్ణ రాజసాగర్ వెళ్ళ వచ్చును. 50 మైళ్ళ వైశాల్యముగల రిజర్వాయర్, బ్రహ్మాండమైన డాం, పచ్చిక బీళ్ళు, పూలతోటలు, అచటి వాతావరణమును శోభాయమానమొనర్చుచున్నవి. మైసూరునకు 11 మైళ్ళ దూరములో కావేరీ నదిలో గల ఒక ద్వీపముపై, టిప్పు సుల్తాన్ కాలములో నిర్మించబడిన శ్రీరంగపట్టణ కోట గలదు. అచటికి 21 మైళ్ళు దూరమునగల మేల్కోటే అను క్షేత్రమున విశిష్టాద్వైతమతప్రవక్త శ్రీరామానుజాచార్యులవారు, పదకొండవ శతాబ్దమున జీవించినారు.



# తిరువాన్కూర్-కొచ్చిన్

దక్షిణ భారతమందు మిగుల ఫలవంతమైనది. తిరువాన్కూర్ - కొచ్చిన్ - కొట్టాయమ్ ప్రాంతమందలి సరస్సులు, కాల్వలు, కొబ్బరిఆకులతో నిర్మించిన గృహములు, కొబ్బరి తోటలు, తిరువాన్కూర్ - కేప్ కో మొరిన్ లందలి బహిరంగ ప్రదేశములు, పశ్చిమ కనుమలు - ఇట్టి వైవిధ్యము గల్గిన దృశ్యములుగలదీ ప్రాంతము. కాయగూరలు ఇచట విరివిగా కాయుచుండును. **5000** అడుగుల నుండి **8000** అడుగుల వరకు ఎత్తు కల్గి లోయలతో, అరణ్యములతో, సరస్సులతో నిండిన పెరియార్ ప్రాంతము, అత్యంత సౌందర్యవంతమైనది. ఈ అరణ్యములందు ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు మొదలైన రకరకముల అడవిజంతువులు, గుంపులుగుంపులుగ తిరుగుచుండును. పెరియార్ సరస్సు పరిసరములు గల వేయి ఎకరముల అరణ్యమును ప్రభుత్వము సంరక్షిత ప్రాంతముగ ప్రకటించినది. పెరియార్ సరస్సునందు పడవపై విహరించు యాత్రికులకు పరిసరారణ్యములందలి అడవిజంతువులు, సరస్సునందు మంచినీరు త్రాగుట చూడవచ్చును. రాష్ట్ర రాజధానియైన తిరువేంద్రం సముద్రతీరమున గలదు ఇందు చిన్న చిన్న కొండలపై నిర్మించబడిన చక్కని భవనములు, పార్కులు, మ్యూజియం, చిత్ర ప్రదర్శనశాల మొదలైన అనేక ఆకర్షణలున్నవి.

త్రివేంద్రమునకు ఏడు మైళ్ళు దక్షిణమున పోయినచో కోవాలమ్ తీరము కన్పించును. ఇది ప్రముఖ జలక్రీడా కేంద్రముగా పేరుగన్నది. ఇంకను దక్షిణముగ ముప్పదిమూడు మైళ్ళు దూరములో గల పద్మనాభ పురము ఒకప్పుడు తిరువాన్కూర్‌నకు రాజధాని. అందుగల పురాతన రాజభవనమున గొప్ప చిత్రములు గలవు. పద్మనాభ పురమునకు **20** మైళ్ళు దక్షిణమున గల కన్యాకుమారి అగ్రమును జేరుటతో భారత భూభాగము అంతమై, హిందూ మహాసముద్రము దర్శనమిచ్చును.


ఇంతటితో "భారతదేశ విహార యాత్ర" పరిపూర్ణమైనది.


28601



# బాల సాహిత్యం




మన రాష్ట్రపతులు

మన ప్రధానమంత్రులు

మన ముఖ్యమంత్రులు

అందమైన భారతదేశం

అందమైన ఆంధ్రప్రదేశ్

అందమైన హైదరాబాద్

జానపద కథలు (2 భాగాలు)

**Andhamina Bharatadesam**
Edited by
Murali Krishna

Art work
Chandram

DTP & Layout
Pallavi Graphics, Hyderabad

Printed at
Sai Srinivasa Printers, Hyderabad

Publishers :
**University Publishing House**
Narayanaguda, Hyderabad.
Andhra Pradesh, India.

Price : Rs.**60/-**